మినీకథ



# గుర్తింపు

జంపాల రాజేశ్వరి

నేను, రామ్మూర్తి పిచ్చాపాటీలో పడ్డాం. నా భార్య, రామ్మూర్తి భార్య వాళ్ల గొడవలో వాళ్లున్నారు. రామ్మూర్తి కొడుకు- ఇంకా ఏడాది కూడా నిండలేదు. మా ముందే అటూ ఇటూ పారాడుతూ ఆడుకుంటు న్నాడు. కొంచెం సేపటికి మా టాపిక్ ఆఫీసు విష యాలమీదికి మళ్ళింది.

"-అబద్ధాలాడటం అందరికీ చేతకాదు. సరే! అదొక కళ-" గుర్నాథం గురించి చెప్తూ అన్నాడు రామ్మూర్తి.

ఆ మాట నిజమనిపించింది నాకు- ఎందుకంటే గుర్నాథంతో రోజుకో అనుభవం ఎదురవుతూనే వుం టుంది కాబట్టి. ఆఫీసులో అడుగుపెట్టిన దగ్గర్నుంచి అతని నోటి నుంచి వచ్చే ప్రతి పదంలోను అబద్ధపు అపశ్రుతులే వినిపిస్తాయన్నది ఆఫీసులో అందరికీ తెల్సిన విషయమే!

"ఒకసారి భార్యకు సీరియస్‌గా వుందని చెప్పి నా దగ్గర యాభై రూపాయిలు తీసుకెళ్లాడు. తీరా ఆ సాయంత్రం మొగుడూ పెళ్ళాం సినిమాహాల్లో దర్శన మిచ్చారు" చెప్పాడు రామ్మూర్తి.

ఈ విషయం విన్నప్పుడు నాకు నవ్వాగలేదు. ఎందుకంటే నన్నూ గుర్నాథం ఒకసారి ఇలాగే బుట్టలో వేసుకున్నాడు.

మా ఆఫీసులో ప్రతి ఒక్కరికీ ఏదో విధమైన ప్రత్యేక గుర్తింపు వుంది. ఏదో ఒక రంగంలో రాణించడ మనేది కూడా అదృష్టమనుకోవాలి! ఎటొచ్చీ ఆ అదృష్టా నికి నేను నోచుకోలేదు. రామ్మూర్తి గురించి కూడా నేను చాలా సార్లు చాలా విన్నాను. అతను లంచగొండి అని చాలా నోట్ల విన్నాను. డబ్బు కక్కుర్తి గల మనిషని విన్నాను. కంటబడ్డ పాముని కన్నంలోకి జారబడనివ్వడని నానుడి- పోతే అతని విషయంలో నేనింతవరకు ఆ ఆరోపణలను 'కన్‌ఫరం' చేసుకోలేకపోయాను. అంటే అతనికి వచ్చిన గుర్తింపుని నేనింకా గుర్తించలేదన్నమాట! ఏమాటకామాటే చెప్పాలి- నాలో ఓ సద్గుణం వుంది. నా అంతట నేను స్వయంగా చూడనిదే దేన్నీ నమ్మను. అందుకే రామ్మూర్తికి ఆ అవలక్షణాలను అంటగట్టలేక పోయాను.

మేం పిచ్చాపాటీ మాట్లాడుకుంటూ వుండగా నా శ్రీమతి భోజనాలకి కేకేసింది. ఇద్దరం లేచాం. రామ్మూర్తి నా కొలీగ్. ట్రాన్స్‌ఫర్ మీద నేనీవూరు వచ్చినప్పుడు ఆఫీసులో మొదటిసారిగా పలకరించింది రామ్మూర్తి! ఆ రోజు ఇంటికి భోజనానికి తీసుకెళ్ళింది రామ్మూర్తి! నాకు ఓ ఇల్లు చూసి పెట్టింది రామ్మూర్తి! అడుగో అలా పెరిగింది అతనితో- అనుకోని అనుబంధం. నేనీ వూరొచ్చి మూణ్ణెల్లైంది! ఈ మధ్యకాలంలో నేను ఫసిగట్టినదాన్ని బట్టి రామ్మూర్తి మీద నాకో అభిప్రాయం వుంది. అతను మితభాషి. నాకది చాలా ఇష్టం. అందుకే ఇద్దరం 'క్లోజ్' కాగలిగామేమో!

ఇవ్వాళ సెలవురోజు కావడంతో రామ్మూర్తి ఫ్యామి లీని లంచ్‌కి పిలిచాను. భోజనం తర్వాత పంచలో కాసేపు పేకేశాం.

పక్కింటి బామ్మగారు అటుగా వెళుతుంటే రామ్మూర్తి కొడుకు 'ఆయ్' అంటూ అరుస్తున్నాడు. పక్షి గడుగ్గాయిలా వున్నాడు.

"అరేయ్. ప్రతివాళ్ళనీ నువ్వేం పలకరించనక్కర్లేదురా... ఇలాగైతే కొడతారు" అంటూ వాణ్ణి దగ్గరికి తీసుకున్నాడు రామ్మూర్తి.

అరగంట తర్వాత కాఫీలయ్యాయి. కాఫీ తాగుతున్నంతసేపు పిల్లవాడు రామ్మూర్తి జేబు సవరిస్తూనే వున్నాడు. బైటికి రాబోతున్న వంద రూపాయిల కాగితాన్ని చేత్తో లోపలికి కుక్కాడు రామ్మూర్తి.

నేనూ మా ఆవిడ వాళ్ళని రోడ్డు దాకా సాగనంపి వచ్చాం. రాగానే మా వాటా ఎదురుగా వంద రూపా యిల కాగితం పడి వుంది. పంచకున్న ఐరన్ గ్రిల్డ్ గేటు తెరుస్తూ, ఆ నోటు పైకి తీసింది రాజీ. "రామ్మూర్తి గారిదై వుంటుంది" అంది. వెంటనే నోటు తీసుకొని బస్టాపుకి చేరాను. నన్ను చూడగానే ఇద్దరూ ఆశ్చర్యపోయారు. నా వైపు ప్రశ్నార్థకంగా చూశాడు రామ్మూర్తి. నేను వంద రూపాయిల కాగితం చూపిస్తూ "మీ డబ్బులేమైనా పడిపోయాయా?" అంటూ ప్రశ్నించాను. రామ్మూర్తి షర్టు జేబు తడిమి చూసుకున్నాడు. అతని కనుబొమలు ముడివడ్డాయి. ముఖంలో ఆందోళన. "అది నాదే.. జారి పడినట్లుంది" అంటూ చెయ్యి చాపాడు. నోటు అతనికిచ్చాను. భార్యాభర్తలిద్దరూ కృతజ్ఞత నిండిన కళ్ళతో థ్యాంక్స్ చెప్పారు.

డబ్బు కంటబడితే స్నేహాన్ని మరిచిపోయే ఈ రోజుల్లో స్నేహానికి విలువ ఇచ్చిన నామీద రామ్మూర్తికి ఎంతో గౌరవం పెరుగుతుంది అన్న సంతృప్తితో ఇంటికి చేరాను. నేను రాగానే రాజీ అడిగింది "రామ్మూర్తి గారిదేనా? ఇచ్చేశారా?"

"ఆ... ఆయనదే పాపం. ఇచ్చేశాను"

అరగంట గడిచింది. రాజీ, నేనూ పంచలో కూర్చుని కాఫీ తాగుతున్నాం. పక్కింటి బామ్మగారు కాంపౌండులో అటూ ఇటూ తారాడుతూ కన్పించారు. ఏదో వెతుకుతున్నట్లనిపించింది. ఆరుబైటికెళ్ళి రాజీ అడిగింది- విషయమేమిటని! వందరూపాయిల కాగితం చెయిజారి ఎక్కడో పడిపోయింది తల్లీ అంటూ నేలమీద చూస్తూ చెప్పిందామె!

నా వీపుమీద రామ్మూర్తి ఛళ్ళున చరుస్తున్నట్లనిపించింది!

ఇప్పుడు రామ్మూర్తిని నేను గుర్తించాను... నా భార్య కూడా!!!